**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 18.05.2024 సమయం : 1310 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1. ఈ నెల 27న తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ప్రచారం జోరుగా సాగుతోంది.**

**2. తెలంగాణలోనే తొలి మెగా ఫుడ్ పార్క్.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో త్వరలో ప్రారంభం కానుంది.**

**3. యాదాద్రిపై ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించారు.**

**4.రాష్ట్రంలో మరోవారం రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.**

ఎన్నికల ప్రచారం

-ఈ నెల 27న పోలింగ్ జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఉప ఎన్నికకు 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల నేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంనుంచి 2021లో ఎమ్మెల్సీగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి గెలిచి ఎమ్మెల్సీ పదవీకి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డిల మధ్య ప్రస్తుత ఉప

ఎన్నికలో గట్టి పోటీ నెలకొంది. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో సీపీఎం పార్టీ కాంగ్రెస్ కు మద్ధతు ప్రకటించింది. కాగా..బీఆర్ఎస్ ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి గట్టి ప్రయత్నం చేస్తోంది. తెలంగాణ శాసనమండలి పునరుద్ధరణ తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థులే ఈ స్థానాన్ని గెలుస్తున్నారు. మరోవైపు బీజేపీ కూడా ఈ ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి పెట్టింది. శాసనమండలిలో తన బలం పెంచుకోవడానికి ఈ ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలనీ ప్రయత్నిస్తోంది.

--డెస్క్

ఈటెల రాజేందర్

-దేశం సుస్థిరంగా, ప్రజలు సురక్షితం గా ఉండాలంటే ఎన్నిక ఏదైనా బీజేపీ కే మద్దతు ఇవ్వాలని మాజీ మంత్రి ఈటెల రాజేందర్ కోరారు. శాసన మండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. వరంగల్ ఖమ్మం నల్లగొండ జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా నల్లగొండలో జరిగిన ఆర్ఎస్ ఎస్ దాని అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

-- (PTC)

కేటీఆర్

-హైదరాబాదులోతాము ప్రారంభించిన మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయడం పట్ల బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు హర్షం వ్యక్తంచేశారు. కొన్నికారణాల వల్ల తమ ప్రభుత్వం ఈ

కాంప్లెక్స్ ను పూర్తి చేయలేకపోయిందని ఆయన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. నాంపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం 2016-17లో ఈ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. దీంతో పాటు తాము చేపట్టిన ఇతర అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని తారకరామారావు కోరారు.

--డెస్క్

జగిత్యాల - ఖండన

-మాజీ మంత్రి మల్లారెడ్డి భూ వివాదాల్లో తన పేరును ప్రస్తావించడాన్ని ప్రభుత్వ విప్ , ధర్మపురి శాసన సభ్యుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఖండించారు. మూడు సంవత్సరాల క్రితమే తన భూమిని అమ్ముకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తనపై పై చేసిన ఆరోపణలను మల్లారెడ్డి వెనక్కి తీసుకోవాలని లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేసారు.

--(PTC)

మెగా ఫుడ్ పార్క్

-తెలంగాణలో మొట్టమొదటి మెగా ఫుడ్ పార్క్ ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ప్రారంభం కానుంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఈ పార్క్ ప్రారంభం కాగలదని భావిస్తున్నారు. దాదాపు రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఏర్పాటయ్యే ఈ మెగా ఫుడ్ పార్క్ లో 25 వేల మందికి ఉపాధి అవకాశాలు

లభిస్తాయి. 2016, నవంబరు 13వ తేదీన ఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. మొత్తం భూమిలో 85 ఎకరాలను ఆహారశుద్ధి జోన్ గా ప్రత్యేకించారు. సత్తుపల్లి, అశ్వారావు పేట నియోజకవర్గాల్లో లభించే జామ, మామిడి, జీడి మామిడి, కొబ్బరి, ఆయిల్ ఫామ్, సపోట, నిమ్మ, మొక్కజొన్న అలాగే సమీప జిల్లాల్లోని లభించే ఆహార ఉత్పత్తులను ఈ పార్కు ద్వారా ప్రాసెస్ చేస్తారు. ఈపార్కుల్లో ఐదేళ్ల పాటు చిన్నపరిశ్రమలకు, మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎస్ జీఎస్టీలో వందశాతం , మధ్య తరహా పరిశ్రమలకు 75 శాతం రాయితీ కల్పిస్తారు. ప్రారంభంలో జామ, మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వర్ రావు చెప్పారు.

--డెస్క్

యాదాద్రి ప్లాస్టిక్

-తిరుమల తరహాలో తెలంగాణలోని యాదాద్రిపై కూడా ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించినట్టు ఎండోమెంట్ అధికారి భాస్కరరావు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం యాదాద్రి కొండపై ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని, వ్యాపారస్తులకు, హోటల్ యజమానులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపిస్తామని భాస్కరరావు ఆకాశవాణికి తెలిపారు.

--స్ట్రింగర్

బైట్

వర్షాలు

-రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో మే నెలలోనే వాతావరణం చల్ల బడింది. ఇంకో వారం రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడం తో ఇక ఈ ఏడాది ఎండల నుంచి గట్టెక్కి నట్టేనని భావిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో 22 వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే ఈ నెలాఖరులో నాలుగైదు రోజులు ఎండలు కొంతమేర పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. కాగా, నైరుతి రుతుపవనాల ఆగమనానికి సానుకూల పరిస్థితులు ఏర్పడటంతో, ఒకదాని వెంట ఒకటి ఆవర్తనాలు ఏర్పడుతున్నాయి. మే 31న నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశిస్తాయని భారత వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది.మార్చి నుంచి మే 18 వరకు తెలంగాణలో 51.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 66.4 మిల్లీమీటర్లు నమోదైంది. 23 జిల్లాల్లో సాధారణం కన్నా ఎక్కువగా వానలు కురిశాయి.

--(DESK)

ధాన్యం- రాజన్న సిరిసిల్ల

-రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2023-24 యాసంగి సీజన్ ధాన్యం సేకరణ మరో పది రోజుల్లో పూర్తికానుందని, జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు.జిల్లాలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఐకేపీ, పిఎసిఎస్ డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో259 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని , ఇప్పటిదాకా దాదాపు 31 వేల మంది కి పైగా రైతుల నుంచి రెండు లక్షల పైగా

మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలించామని కలెక్టర్ తెలిపారు. రైతుల ఖాతాల్లో 344 కోట్ల రూపాయలు జమ చేశామని వెల్లడించారు.

--(PTC)

కామారెడ్డి

-కామారెడ్డి జిల్లా లో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని , జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు తెలిపారు. రైస్ మిల్లులలో గత యాసంగి, వానాకాలానికి సంబందించిన ధాన్యం నిలువలు ఉండడం, స్థలాభావం వల్ల ప్రస్తుత యాసంగి ధాన్యం అన్ లోడ్ చేసుకోవడంలో కాస్త ఆలస్యమవుతున్నదని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మిల్లులలో స్థలాన్ని సర్దుబాటు చేసుకొని త్వరితగతిన అన్ లోడ్ చేసుకొని లారీలను త్రిప్పి పంపవలసినదిగా రైస్ మిల్లర్లను ఆదేశించామన్నారు. అదేవిధంగా ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

-- (PTC-RS)

క్రికెట్

-ఐపీఎల్ లో హైదరాబాద్ సన్ రైజర్స్ తన చివరి మ్యాచ్ ని ఈ రోజు పంజాబ్ కింగ్స్ తో ఆడుతోంది. ఈ మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ కి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ మ్యాచ్ లో హైదరాబాద్ జట్టు గెలిస్తే పాయింట్ల పట్టికలో 17 పాయింట్లతో రెండోస్థానానికి

చేరే అవకాశం ఉంటుంది. అయితే ఇది జరగాలంటే కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగే తమచివరి మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ఓడిపోవాల్సి ఉంటుంది. అప్పుడు రాజస్థాన్ 16 పాయింట్లతో మూడో స్థానంలో , 17 పాయింట్లతో హైదరాబాద్ రెండో స్థానంలో కొనసాగుతాయి. కాగా..ఈ మధ్యాహ్నం మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు.

-డెస్క్

నిర్మల్

-నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ పేర్కొన్నారు. జిల్లాలోని ఆస్పత్రులను ఆయన తనిఖీ చేశారు. పాలీక్లినిక్ లు, కంటి ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్ లు, ఆయుర్వేద, సిద్ధయోగ, ప్రకృతి, ఫిజియోథెరఫి, డయాగ్నస్టిక్ కేంద్రాలు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

--పీటీసీ, నిర్మల్

జగిత్యాల ఈజీఎస్

-జగిత్యాల జిల్లాలో వచ్చేవారం నుంచి అన్ని గ్రామాల్లో ఉపాధి హామి పనులకు రావడానికి ఆసక్తి ఉన్న కూలీలను గుర్తించి వారిని పనులకు తీసుకురావాలని

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఎక్కువ కుటుంబాలకు వందరోజుల ఉపాధిహామి పనులు కల్పించేందుకు గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. అమ్మ ఆదర్శపాఠశాలల్లో గుర్తించిన పనులు జూన్ 12 లోగా పూర్తి చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో చెత్తను తొలగించి మురికినీటి కాలువలను శుభ్రం చేయాలని సూచించారు.

--పీటీసీ, జగిత్యాల

మద్యం విక్రయాలు

-రాజన్న సిరిసిల్ల జిల్లాలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదలైన తర్వాత పోలింగ్ జరిగే వరకు రెండు నెలల కాలంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 84 కోట్ల రూపాయలు విలువైన మద్యం విక్రయాలు జరిగినట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు చెప్పారు.

-పీటీసీ, రాజన్న సిరిసిల్ల

--------------

జగిత్యాల ప్రమాదం

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు శివారులో ప్రధాన రహదారి వంతెనపై పాలవ్యాను-లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరూ మృతి చెందారు. ఈ ప్రమాదంతో పోలీసులు ట్రాఫిక్ ను దారీ మళ్లించారు.

-పీటీసీ, జగిత్యాల జిల్లా

--------------